# సాక్షి జగిత్యాల


బుధవారం। 7। ఫిబ్రవరి। 2024






**అంజన్న సన్నిధి.. భక్తజన పెన్నిధి**

జగిత్యాల జిల్లా కొండగట్టు శ్రీఆంజనేయ స్వామి ఆలయం మంగళవారం వేలాది మంది భక్తులతో కిక్కిరిసిపోయింది. ఆలయానికి భారీగా తరలివచ్చారు. 8లో▸



**'ఎక్స్‌పోర్ట్' జోన్ ఫలితమేది?**

ఆయా జిల్లాల్లో రైతులు సాగు చేసే పంటల విస్తీర్ణం, దిగుబడి, నాణ్యతను బట్టి కేంద్ర ప్రభుత్వం అంతర్జాతీయ ఎగుమతి హబ్‌లను ఏర్పాటు చేస్తుంది. 8లో▸

గరిష్టం/కనిష్టం 31.0/21.0

**వాతావరణం**

వాతావరణం పొడిగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండవేడిమి పెరుగుతుంది. రాత్రి, సాయంత్రం వేళల్లో చలిగాలులు కొనసాగుతాయి.

## న్యూస్‌రీల్

### మహిళల భద్రతకు పోలీసుల కృషి



భరోసా సెంటర్ సిబ్బందితో ఎస్పీ, పోలీసులు

జగిత్యాలక్రైం: మహిళల భద్రత కోసం పోలీసు శాఖ కృషి చేస్తోందని ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ అన్నారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన భరోసా కేంద్రాన్ని డీజీపీ రవిగుప్తా హైదరాబాద్ కార్యాలయం నుంచి మంగళవారం వర్చువల్‌గా ప్రారంభించారు. ఉమెన్ సేఫ్టీవింగ్ అడిషనల్ డీజీపీ శిఖాగోయల్, అడిషనల్ డీజీపీ సీఐడీ మహేశ్ భగవత్, మల్టీజోన్ 1, 2 ఐజీ తరుణ్ జోషి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. చిన్నారుల సంరక్షణ పోలీసుల ప్రధాన ధ్యేయమన్నారు. మహిళలు, పిల్లలను అక్కున చేర్చుకుని కొండంత ధైర్యాన్ని ఇస్తున్నామని తెలిపారు. పోలీస్‌స్టేషన్లలో నమోదైన పోక్సో, అత్యాచార కేసుల్లో కౌన్సెలింగ్ నిర్వహించడంతోపాటు, సీడబ్ల్యూసీ ద్వారా బాధిత మహిళలకు షెల్టర్ కల్పిస్తామని వివరించారు. బాధితులకు భరోసా సెంటర్ అండగా ఉంటుందని, వేధింపులు, అత్యాచారం, బాధిత మహిళలకు పిల్లలకు మెడికల్, న్యాయ సలహా, వైద్యం, కౌన్సెలింగ్, సైకాలజిస్ట్ సేవలు ఒకేచోట అందించేందుకు భరోసా సెంటర్‌ను ఏర్పాటు చేసిందన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ భీంరావు, డీఎస్పీ వెంకటస్వామి, సీఐలు వెంకటేశ్వర్లు, నాగేశ్వర్‌రావు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ జానిమియా పాల్గొన్నారు.

### ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం అందిస్తున్న టీఆర్టీఎఫ్ నాయకులు

జగిత్యాల: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని టీఆర్టీఎఫ్ నాయకులు డీఈవో జగన్మోహన్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సర్వీస్ రెగ్యులరైజేషన్ సర్టిఫికెట్ల పరిశీలన చేపట్టి ఉత్తర్వులు అందించాలన్నారు. ఎస్సెస్సీ 2023 మూల్యాంకనలో పాల్గొన్న ఉపాధ్యాయులకు రెమ్యునరేషన్, టీఏ, డీఏలు చెల్లించాలన్నారు. 2022లో పాల్గొన్న ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు సంపాదిత సెలవు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో టీఆర్టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు తుంగూరి సురేశ్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

### సిరికొండ విండో చైర్మన్‌గా జీవన్‌రెడ్డి



కొత్త చైర్మన్ జీవన్‌రెడ్డిని సన్మానిస్తున్న డైరెక్టర్లు

కథలాపూర్(వేములవాడ): మండలంలోని సిరికొండ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్‌గా అదే గ్రామానికి చెందిన కందరి జీవన్‌రెడ్డి ఎన్నికయ్యారు. చైర్మన్ ఎన్నికను అధికారులు మంగళవారం నిర్వహించగా.. డైరెక్టర్లు కందరి జీవన్‌రెడ్డి, చుక్క దేవరాజం, కందరి కిషన్‌రెడ్డి నామినేషన్లు దాఖలు చేశారు. మొత్తం 13 మంది డైరెక్టర్లు హాజరయ్యారు. వీరిలో 9 మంది కందరి జీవన్‌రెడ్డికి చేతులెత్తి మద్దతు తెలిపారని జిల్లా సహకార అధికారి సత్యనారాయణ ప్రకటించారు. దేవరాజంకు నలుగురు, కిషన్‌రెడ్డికి మద్దతుగా ఎవరూ చేతులెత్తలేదు. దీంతో జీవన్‌రెడ్డి చైర్మన్‌గా ఎన్నికై నట్లు అధికారులు ప్రకటించారు. జీవన్‌రెడ్డిని తోటి డైరెక్టర్లు, అధికారులు, నాయకులు సన్మానించారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కోరుట్ల సీఐ ప్రవీణ్‌కుమార్, కథలాపూర్ ఎస్సై కిరణ్‌కుమార్ తమ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

### నేడు దుబ్బరాజన్న జాతరకు టెండర్లు

సారంగాపూర్: ప్రముఖ పుణ్యక్షేత్రమైన దుబ్బరాజన్న ఆలయంలో వివిధ వస్తువుల అమ్మకాలకు బుధవారం ఉదయం 11 గంటలకు టెండర్లు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో అనూష తెలిపారు. మహాశివరాత్రి జాతర సందర్భంగా 5రోజులపాటు జరిగే కార్యక్రమాలతో పా టు, ఈనెల ఇకటి నుంచి వచ్చే ఏడాది జనవరి 31వరకు టెండరు పొందిన వారు హక్కులు కలిగి ఉంటారని తెలిపారు. కొబ్బరికాయ, బె ల్లం, పూజసామగ్రి అమ్ముకునేందుకు టెండర్‌లో పాల్గొనేవారు రూ.2 లక్షలు, లడ్డూ, పులి హోర, ప్రసాదాలు అమ్ముకోవడానికి రూ.2లక్షలు, పూలు, పండ్లు అమ్మకాలకు రూ.10వేలు, వివిధ ఆటబొమ్మలు అమ్ముకునేందుకు రూ. 10 వేలు, పాదరక్షలు, వివిధ వస్తువులను భద్రపరచడానికి రూ.10 వేల చొప్పున డిపాజిట్ చెల్లించాలని పేర్కొన్నారు.

# ఆగని 'వీడీసీ' ఆగడాలు

- అభివృద్ధి పేరిట ఆంక్షలు..
- పచ్చని పల్లెల్లో బహిష్కరణల చిచ్చు..
- నియంత్రణపై శ్రద్ధ కరువు



వీడీసీ బహిష్కరణపై నిరసన తెలుపుతున్న గౌడ కులస్తులు

కోరుట్ల/మెట్‌పల్లిరూరల్: నక్సల్స్ ప్రాబల్య ప్రాంతాల్లోని పల్లెల్లో ఎన్నికల నిర్వహణకు అనుకూలమైన పరిస్థితులు లేని కాలంలో అభివృద్ధి లక్ష్యంగా పురుడు పోసుకున్న గ్రామాభివృద్ధి కమిటీ (వీడీసీ)లు నేడు పక్కదోవ పడుతున్నాయి. అభివృద్ధి సాకుగా ఆంక్షలు విధిస్తూ పచ్చని పల్లెల్లో వివాదాల చిచ్చుకు ఆజ్యం పోస్తున్న సంఘటనలు కలవరపెడుతున్నాయి. జిల్లాలోని కోరుట్ల సబ్ డివిజన్ పరిధిలో కేవలం పదిహేను రోజుల వ్యవధిలో రెండుచోట్ల వీడీసీలు పలువురిపై బహిష్కరణ ఆంక్షలు విధించడం ప్రజాస్వామ్య వ్యవస్థను అపహాస్యం చేస్తోంది.

**పాతికేళ్ల క్రితం ఊపిరి**

ఉమ్మడి కరీంనగర్–నిజామాబాద్ జిల్లాల సరిహద్దు ఉన్న పశ్చిమ డివిజన్ అటవీ ప్రాంతంలో నక్సల్స్ ప్రాబల్యం సుమారు ఇరవై ఏళ్లపాటు కొనసాగింది. ఆ సమయంలో ప్రజాస్వామ్య వ్యవస్థకు సమాంతరంగా ఒక వేదిక కోసం పీపుల్స్‌వార్ నక్సల్స్ కొన్ని గ్రామాల్లో గ్రామాభివృద్ధి కమిటీలకు ఊపిరిపోశారు. ఆ కమిటీలు గ్రామాల్లో నిలిచిపోయిన అభివృద్ధి పనులను సమీక్షించి స్థానికంగా అవసరమైన నిధులను సమకూర్చి గ్రామాల్లో పాఠశాలలు, చెరువులు, రోడ్లు వంటి పనులను చేపట్టి ప్రజలకు సౌకర్యవంతంగా చర్యలు తీసుకునేవి. గ్రామాల్లో చిన్న చిన్న వివాదాలు చోటు చేసుకున్నా సామరస్యంగా అందరి మెప్పుతో పరిష్కరించేందుకు పాటుపడేవి. సిరిసిల్ల జిల్లాలోని పలు గ్రామాల్లో ఇవే గ్రామాభివృద్ధి కమిటీల ఆధ్వర్యంలో అన్నల సూచనలతో పదుల సంఖ్యలో చెరువులు, రోడ్లను బాగుచేసిన దాఖలాలు ఉన్నాయి. మారుమూల పల్లెల్లో వీడీసీల ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై ఆసక్తితో నక్సల్స్ ప్రాబల్యం లేకుండానే ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్ సరిహద్దుల్లో కోరుట్ల, మెట్‌పల్లి, ఇబ్రహీంపట్నం, కామారెడ్డి, సిరిసిల్ల, ఆర్మూర్, కమ్మర్‌పల్లి పరిసరాల్లో బలంగా మారాయి. ఇలా పురుడుపోసుకున్న వీడీసీలు తదనంతర కాలంలో కొన్ని చోట్ల కనుమరుగు కాగా.. మరికొన్ని చోట్ల ఇప్పటికీ చలామణిలో ఉన్నాయి.

**పక్కదోవ..**

అభివృద్ధి లక్ష్యంగా రూపుదిద్దుకున్న వీడీసీలు కాలక్రమేణా పక్కదోవ పడుతున్నాయి. కొన్ని గ్రామాల్లో వీడీసీలు కుల బహిష్కరణలు, పంచాయితీలు చేయడం, వాగుల్లోని ఇసుక, కూల్‌డ్రింక్స్, మద్యంతోపాటు ఇతర స్థానిక వనరులకు రూ.లక్షల్లో టెండర్లు నిర్వహిస్తున్నాయి. వేలంతో వచ్చిన డబ్బులను గ్రామాల్లో గుడులు, పాఠశాలల కోసం ఖర్చు చేస్తూ సరైన దారిలో ఉన్న వీడీసీలు ఇప్పటికీ కొన్ని గ్రామాల్లో ఉన్నా.. అనేక గ్రామాల్లో వీడీసీలు వేలంపాటల్లో వచ్చిన డబ్బులు దుర్వినియోగం చేస్తూ.. పనికిరాని పంచాయితీల్లో తలదూరుస్తూ గ్రామాల్లో వివాదాలకు ఆజ్యం పోస్తున్నాయి.

**ఆంక్షలు ఎంతో కఠినం..**

పదిహేను రోజుల్లో మెట్‌పల్లి సబ్ డివిజన్‌లోని ఇబ్రహీంపట్నం మండలంలోని ఓ గ్రామంలో చెలరేగిన చిన్నపాటి వివాదంలో వీడీసీ మూడు కుటుంబాలను బహిష్కరించింది. రెండు రోజుల క్రితం మెట్‌పల్లి మండలంలోని ఆత్మకూర్, ఆత్మనగర్ గ్రామాలకు చెందిన కొంతమంది గౌడ కులస్తులను ఓ భూవివాదంలో వీడీసీ బహిష్కరించింది. బహిష్కరణకు గురైన బాధితులతో గ్రామంలోని ఎవరూ మాట్లాడకపోవడం.. బట్టలు ఉతికేవారు రాకపోవడం.. వ్యవసాయ పనులకు కూలీలు వెళ్లకపోవడం.. కిరాణాల్లో నిత్యావసర సరుకులు ఇవ్వకపోవడం.. కనీసం హోటళ్లలో చాయ్, టిఫిన్లు ఇవ్వకపోవడం వంటి కఠిన ఆంక్షలు గ్రామీణ సమాజంలో బాధితుల స్థాయిని దిగజార్చి, మానసిక స్థైర్యానికి దెబ్బకొడుతున్నాయి. ఒకవేళ బాధితులు తప్పు చేసి ఉంటే ప్రజాస్వామ్య పద్ధతుల్లో ఫిర్యాదు చేసేందుకు అనేక మార్గాలు ఉన్న ఈ కాలంలో బహిష్కరణలు పరిష్కారం కాదన్న వాదనలు వినిపిస్తున్నాయి.

**నియంత్రణపై శ్రద్ధ ఏది..?**

వీడీసీల ఆగడాలను నియంత్రించి ఈ వ్యవస్థను రూపుమాపడానికి కృషి చేయాల్సిన రెవెన్యూ, పోలీసు యంత్రాంగం నామమాత్రంగా వ్యవహరిస్తోందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కోరుట్ల, మెట్‌పల్లి సబ్ డివిజన్‌లలో ఏటా చాలా గ్రామాల్లో వీడీసీలు స్థానిక వనరులకు యథేచ్ఛగా వేలంపాటలు నిర్వహించడం, కుల బహిష్కరణలకు పాల్పడటం, పంచాయితీలతో వివాదాలకు ఆస్కారమిస్తున్న సంఘటనలు చోటు చేసుకుంటున్నప్పటికీ క్షేత్రస్థాయిలో అవసరమైన చర్యలు తీసుకున్న దాఖలాలు కనిపించడం లేదు. కేవలం వీడీసీలపై కేసులు నమోదు చేసి చేతులు దులుపుకుంటున్నారు. గ్రామాల్లో రెవెన్యూ, పోలీసు శాఖలు సంయుక్తంగా సభలు నిర్వహించి అన్ని సమస్యల పరిష్కారానికి అధికార యంత్రాంగం, ప్రజాప్రతినిధులు అందుబాటులో ఉన్న క్రమంలో వీడీసీ ఏర్పాటు అవసరం లేదన్న ప్రచారంతోపాటు కౌన్సెలింగ్ ఇవ్వాల్సి ఉంది. వీడీసీల ఏర్పాటుతో జరుగుతున్న అనర్థాలను వివరించి గ్రామస్తుల్లో అవగాహన కల్పించి చైతన్యం చేయాల్సిన అవసరం ఉంది. ఈ దిశలో జరుగుతున్న ప్రయత్నాలు అంతంత మాత్రమే కావడంతో ఏళ్ల క్రితం ఏర్పాటైన వీడీసీ సంస్కృతి ఇప్పటికీ సజీవంగా కొనసాగడం గమనార్హం.

### బహిష్కరణ అవాస్తం

మెట్‌పల్లి మండలంలోని ఆత్మనగర్, ఆత్మకూర్ గ్రామాలకు చెందిన గౌడ కులస్తులను తాము బహిష్కరించలేదని ఆత్మకూర్ వీడీసీ సభ్యులు, గ్రామస్తులు ఖండించారు. మంగళవారం మెట్‌పల్లి డీఎస్పీ కార్యాలయానికి వెళ్లి డీఎస్పీ రవీంద్రరెడ్డికి వినతిపత్రం అందించారు. సాంఘిక బహిష్కరణ అవాస్తవమని, గౌడ కులస్తులపై ఎలాంటి ఆంక్షలూ విధించలేదని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. వారిపై సాంఘిక బహిష్కరణకు తాము తీర్మానించామనడంలో అర్థం లేదని ఆత్మకూర్ వీడీసీ అధ్యక్షుడు రమేశ్ స్పష్టం చేశారు.

### ఆంక్షలు ఎత్తేయాలి



వీడీసీ మాపై విధించిన ఆంక్షలు తొలగించి మాకు న్యాయం చేయాలి. మూడు రోజులుగా గ్రామంలో మాతో ఎవరూ మాట్లాడటం లేదు. కిరాణా సామాన్లు ఇవ్వడం లేదు. హోటళ్లలో చాయ్, టిఫిన్లు ఇస్తలేరు.

– రాజమల్లయ్య, ఆత్మకూర్, మెట్‌పల్లి మండలం

### కేసులు నమోదు చేశాం



ఆత్మకూర్, ఆత్మనగర్‌లో సామాజిక బహిష్కరణపై బాధితుల ఫిర్యాదు మేరకు వీడీసీలపై కేసులు నమోదు చేశాం. వివాదాలు చోటు చేసుకుంటే గ్రామాల్లో రెవెన్యూ అధికారులతో కలిసి గ్రామస్తులకు కౌన్సెలింగ్ ఇస్తున్నాం.

– రవీందర్‌రెడ్డి, మెట్‌పల్లి, డీఎస్పీ

# వేతన యాతన



తాటిపెల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం

- చాలీచాలని వేతనాలతో కారోబార్ల ఇబ్బందులు
- పట్టించుకోని పాలకులు, అధికారులు
- జిల్లాలో 380 గ్రామ పంచాయతీలు
- 276 మంది కారోబార్లు

గొల్లపల్లి: చాలీచాలని వేతనాలతో కారోబార్ల దుస్థితి దుర్భరంగా మారింది. గ్రామాల్లో సమస్యలను ముందుండి పరిష్కరించే కారోబార్ల జీవితాలు అగమ్యగోచరంగా మారాయి. ప్రభుత్వ పథకాల అమలుతోపాటు, ప్రతి అభివృద్ధి పనిలో వీరిపాత్ర కీలకం. అయితే 40 ఏళ్లుగా అరకొరత వేతనాలతో ఇబ్బంది పడుతున్నారు. రాష్ట్రం ఏర్పడక ముందు తమ పరిస్థితి దయనీయంగా ఉండేదని, ప్రత్యేక రాష్ట్రం వచ్చాకైనా బతుకులు బాగుపడతాయని ఆశించామని, అయినా పట్టించుకునే వారు కరువయ్యారని కారోబార్లు అంటున్నారు. రెండోసారి అధికారం చేపట్టిన తర్వాత బీఆర్‌ఎస్ ప్రభుత్వం 2019 అక్టోబర్‌లో జీవో 51 ద్వారా మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని తీసుకొచ్చింది. పాత సిబ్బందిని కొనసాగిస్తూ జీపీల్లో ప్రతి 500 జనాభాకు ఒకరిని నియమించింది. జిల్లాలో 20మండలాలు.. 380 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఇందులో 276మంది కారోబార్లు పనిచేస్తున్నారు. ఇంతకాలంగా విధులు నిర్వర్తించిన తమకు ఎలాంటి పదోన్నతులు, సీనియార్టీ లేకుండాపోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జీవో 51ను సవరించి, జీఓ 60 ప్రకారం మున్సిపల్ సిబ్బందికి రూ.19,500, కింది స్థాయి సిబ్బందికి రూ.16,600 వేతనం అందించాలని ఏళ్ల తరబడి డిమాండ్ చేస్తున్నారు. పారిశుధ్యం, నీటి సరఫరా, ఇంటిపన్నుల వసూళ్లు, ఎన్నికల విధుల్లో భాగంగా బీఎల్‌వోలుగా పనిచేసినా సరైన గుర్తింపు లేదని ఆవేదనవ్యక్తం చేస్తున్నారు. కొన్ని గ్రామ పంచాయతీల్లో ఉద్యోగుల కొరతతో అన్ని పనులు చేస్తున్నా.. అందేది మాత్రం అదే జీతమంటున్నారు. అటు అధికారులు, ఇటు పాలకుల అజమాయిషీతో కారోబార్లు మరిన్ని ఇబ్బందులకు గురవుతున్నారు. తాజాగా అధికారంలోకొచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి తమ సమస్యలను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

### పర్మినెంట్ చేయాలి



35 ఏళ్లుగా కారోబార్‌గా విధులు నిర్వర్తిస్తున్న. గ్రామంలో జరిగే ప్రతి కార్యక్రమానికీ ముందుండాల్సిందే. మున్సిపల్ ఉద్యోగుల మాదిరిగా వేతనాలు ఇచ్చి ఆదుకోవాలి. మల్టీపర్పస్ విధానంలో సీనియార్టీ, పదోన్నతులు కోల్పోయిన వారికి రెండో కార్యదర్శిగా పదోన్నతి కల్పించాలి.

– కొత్తపల్లి సత్యనారాయణ, ఎల్లాపూర్

### సమస్యలు పరిష్కరించాలి



పేరుకే గ్రామ పంచాయతీలో ఉద్యోగం. వేతనాలు తక్కువ, పనిభారం ఎక్కువ.. పారిశుధ్య పనులు చేయాలని సర్పంచ్‌లు, కార్యదర్శులు కారోబార్లను ఒత్తిడికి గురిచేస్తున్నారు. ఇది సరికాదు. పనిభారం ఎక్కువగా ఉంది. మా న్యాయమైన సమస్యలను ప్రభుత్వం గుర్తించాలి.

– ఒల్లపు గంగమల్లు, కారోబార్ల సంఘం జిల్లా అధ్యక్షుడు

## మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి



మహిళలతో డీఆర్డీఏ పీడీ నరేశ్, అధికారులు

జగిత్యాలరూరల్: గ్రామీణప్రాంతాల మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని డీఆర్డీఏ పీడీ నరేశ్ అన్నారు. జగిత్యాలరూరల్ మండలం పొరండ్ల, కల్లెడలో నాబార్డ్, స్పందన సేవ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత ఆధునిక ఫ్యాషన్ డిజైనింగ్‌లో శిక్షణ పొందిన వారికి మంగళవారం సర్టిఫికెట్లు అందించారు. మహిళాసంఘాల సభ్యులకు ప్రభుత్వ పాఠశాలల్లో డ్రెస్సులు కుట్టే బాధ్యతలు అప్పగించామని, మహిళలు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. లీడ్ బ్యాంక్ మేనేజర్ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ మహిళలకు బ్యాంకులు రుణాలు ఇస్తున్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శిక్షణ పొందిన మహిళలకు యూనిట్ల ఏర్పాటుకు రుణ సౌకర్యం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో ఏపీడీ సుధీర్, స్పందన సంస్థ నిర్వాహకులు శోభారాణి, టీలైఫ్ జిల్లా ఆర్గనైజర్ పొన్నాల శిరీషరెడ్డి, ఎంపీవో రవిబాబు, కేడీసీసీ బ్యాంక్ మేనేజర్ మోయిన్, సింగిల్ విండో మాజీ చైర్మన్ నారాయణరెడ్డి, ఏపీఎం గంగాధర్ పాల్గొన్నారు.

## 'డబుల్' ఇళ్లలో సదుపాయాలు కల్పిస్తాం

- మూడు నెలల్లో గృహప్రవేశం చేయిస్తాం
- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి



డబుల్ ఇళ్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాలటౌన్: జగిత్యాల అర్బన్ హౌజింగ్‌కాలనీలోని డబుల్ బెడ్‌రూం ఇళ్లలో వసతులు కల్పించి మూడు నెలల్లో గృహప్రవేశాలు చేయిస్తామని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. మంగళవారం అధికారులతో కలిసి డబుల్‌బెడ్‌రూం ఇళ్లను సందర్శించారు. ఉగాది వరకు మురికి కాలువలు, విద్యుత్‌తోపాటు తాగునీటి సౌకర్యాలు కల్పిస్తామని పేర్కొన్నారు. గత పాలకులు వసతులు కల్పించకుండా ఎన్నికలకు ముందు ఆదరాబాదరాగా పట్టాలు ఇచ్చారని తెలిపారు. వివిధ దశల్లో ఉన్న 1600 ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసేందుకు కృషి చేస్తానన్నారు. తెలుగు, ఇంగ్లిష్, ఉర్దూ మీడియం పాఠశాలలతోపాటు రామ మందిరం, మసీదు, చర్చి వంటివి నిర్మించి అన్ని మతాలను గౌరవిస్తామన్నారు. కాంగ్రెస్ నాయకులు కొత్త మోహన్, పుప్పాల అశోక్, మన్సూర్, నేహాల్, శేఖర్, గుండ మధు తదితరులు ఉన్నారు.

### విదేశాంగ శాఖ కార్యాలయానికి చాంద్‌పాషా

జగిత్యాలరూరల్: జిల్లాకు చెందిన పలువురు గల్ఫ్‌లో మరణించి న్యాయ సహాయం అందక ఇబ్బంది పడుతున్న వారి వివరాలను గతంలో జగిత్యాలకు చెందిన టీపీసీసీ ఎన్‌ఆర్‌ఐ కన్వీనర్ షేక్ చాంద్‌పాషా విదేశాంగ శాఖ కార్యాలయంలో ఫిర్యాదు చేశాడు. వారి పిలుపు మేరకు ఢిల్లీలోని ఆగ్రోభవన్‌లో చాంద్‌పాషా గల్ఫ్ కుటుంబ సభ్యులతో కలిసి హాజరయ్యారు. మెట్‌పల్లికి చెందిన జాహిద్ సౌదీలో మరణించగా అతని భార్య రఫీ బేగం తనకు జరిగిన అన్యాయాన్ని వారి దృష్టికి తీసుకెళ్లారు.

## ఆ కార్మికులను కొనసాగించండి

- కలెక్టర్‌కు కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ లేఖ

మెట్‌పల్లి: తమ వద్ద పని చేస్తూ.. మున్సిపల్ నుంచి వేతనాలు తీసుకుంటున్న వారిని క్యాంపు కార్యాలయానికి కేటాయించాలని కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ కలెక్టర్‌కు లేఖ రాసినట్లు తెలిసింది. ఎమ్మెల్యే సంజయ్, మాజీ ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు ఇంట్లో, ఫాంహౌజ్‌లో పని చేస్తున్న పలువురికి కాన్సేల్లుగా మెట్‌పల్లి మున్సిపల్ నుంచి వేతనాలు ఇస్తున్నారని, వారిని అక్కడి నుంచి తొలగించి ఇప్పటివరకు చెల్లించిన వేతనాలను ఇద్దరి నుంచి రికవరీ చేయాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేస్తున్న సంగతి తెలిసిందే. అంతటితో ఆగకుండా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కాంగ్రెస్ విమర్శలపై ఇప్పటివరకు స్పందించని ఎమ్మెల్యే.. తమవద్ద పనిలో ఉన్న వారందరినీ క్యాంపు కార్యాలయానికి కేటాయించాలని రెండు రోజుల క్రితం కలెక్టర్‌కు లేఖ రాసినట్లు సమాచారం. ఓ వైపు తొలగించాలని కాంగ్రెస్ నాయకులు పట్టుబడుతుండడం.. మరోవైపు కొనసాగించాలని ఎమ్మెల్యే కోరుతుండడంతో ఈ వ్యవహారంలో కలెక్టర్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటారన్నది చర్చనీయాంశమైంది.

# తప్పుతారా.. ఆపుతారా..!

- 2021 ఆగస్టులో వాట్సాప్‌లో లీకైన డిగ్రీ పేపర్లు
- చివరికి ఇద్దరిని నిందితులుగా చూపిన పోలీసులు
- ఉసూరుమనిపించిన అధికారుల విచారణ
- తప్పించుకున్న అనుమానిత కళాశాలల సిబ్బంది
- ఇప్పటికే దర్యాప్తు పూర్తయిందంటున్న పోలీసులు
- కొత్త చట్టం ప్రకారం విచారించాలంటున్న విద్యార్థి సంఘాలు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: శాతవాహన యూనివర్సిటీ డిగ్రీ పేపర్ లీకేజీ విషయంలో పోలీసుల తీరు కొండను తవ్వి ఎలుకను పట్టినట్లు ఉంది. పరీక్ష సమయానికి ముందే పేపర్ లీకైనా.. పరీక్షను రద్దు చేయకుండా కేవలం ఇద్దరిని బాధ్యులను చేసి పోలీసులు చేతులు దులుపుకున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తాజాగా ప్రశ్నాపత్రాల లీకేజీలపై కొరడా ఝుళిపిస్తూ కేంద్రం కొత్తచట్టం తీసుకొచ్చిన విషయం తెలిసిందే. దీంతో రెండున్నరేళ్ల కిందట రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపిన 'శాతవాహన వర్సిటీ డిగ్రీ ప్రశ్నపత్రాల లీకేజీ' వ్యవహారం మరోసారి తెరపైకి వచ్చింది. ఈ కేసును తాజా చట్టం ప్రకారం విచారించి నిందితులకు కఠిన శిక్ష అమలు చేయాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

**2021లో ఏం జరిగింది..?**

2021 ఆగస్టు 18న కరీంనగర్‌లోని శ్రీరాజరాజేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద ఉదయం పరీక్ష సమయానికి అర్ధగంట ముందే ఉదయం 9.30గంటలకు ఆ రోజు జరగాల్సిన ఫిజిక్స్ పేపర్–2 వాట్సాప్‌లో ప్రత్యక్షమైంది. తరువాత పలు స్టూడెంట్ గ్రూపుల్లో చక్కర్లు కొట్టింది. అంతకుముందు జరిగిన పేపర్–1 కూడా లీకైంది. 16వ తేదీన జరిగిన మ్యాథ్స్ పేపర్ కూడా లీకైందని అప్పట్లో 'సాక్షి' ఆధారాలు సంపాదించి ప్రచురించిన విషయం తెలిసిందే. తెలంగాణ మాల్‌ప్రాక్టీస్ యాక్ట్ కింద నమోదు చేసిన ఈ కేసును దర్యాప్తుచేసి పోలీసులు చార్జిషీటు కూడా వేసినట్లు సమాచారం. వేలాదిమంది విద్యార్థులు పరీక్షలు రాసిన పేపర్ ముందే లీకవడంలో అటు వర్సిటీ, ఇటు ప్రైవేటు కాలేజీలు యాజమాన్యాలు ఉలిక్కిపడ్డాయి. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. కరీంనగర్, సిరిసిల్లకు చెందిన కొన్ని ప్రైవేటు డిగ్రీ కళాశాలల సిబ్బంది పరీక్షకు ముందే పేపర్ లీక్ చేసి తమ కాలేజీ విద్యార్థులకు మంచి మార్కులు రావాలని కుట్రపన్నినట్లు సమాచారం. అయితే పోలీసులు మాత్రం ఈ కేసులో 'కొండను తవ్వి ఎలుకను పట్టిన చందం'గా కేవలం ఇద్దరిని నిందితులుగా చూపి చేతులు దులుపుకున్నారన్న విమర్శలు మూటగట్టుకున్నారు.



శాతవాహన వర్సిటీ

**కొత్త చట్టం ఏం చెబుతోంది..?**

పబ్లిక్ ఎగ్జామినేషన్ బిల్–2024 ఏం చెబుతోందంటే.. ప్రభుత్వ సంస్థలు నిర్వహించే పబ్లిక్ పరీక్షలు, ప్రవేశ పరీక్షలు, కొలువుల పరీక్షలకు సంబంధించిన పేపర్లు లీకయినా, సమాధాన పత్రాలు మార్చినా, అవకతవకలకు పాల్పడినా రూ.కోటి జరిమానా, పదేళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తారు. తెలంగాణలో 2016లో ఎంసెంట్ పేపర్లు రెండుసార్లు, 2021లో శాతవాహన వర్సిటీ డిగ్రీ పరీక్షలు, 2023 ఏప్రిల్‌లో పదో తరగతి ప్రశ్నపత్రాలు, అంతకుముందు టీఎస్‌పీఎస్సీ నిర్వహించిన పలు పోటీ పరీక్షల ప్రశ్నపత్రాలు లీకైన నేపథ్యంలో ఈ బిల్లు ప్రాధాన్యం సంతరించుకుంది.

**రెండూ కరీంనగర్ కేంద్రంగానే..**

పదో తరగతి లీకేజీ, శాతవాహన డిగ్రీ ప్రశ్నపత్రం లీకేజీకి కరీంనగర్‌కు సంబంధం ఉండడం గమనార్హం. పదో తరగతి లీకేజీ కేసులో ఎంపీ బండి సంజయ్‌ను అరెస్టు చేశారు. అది రాజకీయ దుమారానికి దారి తీసింది. అప్పటి హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌ను సైతం విచారించిన విషయం తెలిసిందే. పదో తరగతి పేపర్ల లీకేజీలో లోతుగా, దూకుడుగా దర్యాప్తు చేసిన పోలీసులు.. డిగ్రీ ప్రశ్నపత్రాల లీకేజీలో అంతగాలోతుగా వెళ్లలేదన్న విమర్శలు ఉన్నాయి. ఈ రెండింటినీ ఒకే సెక్షన్ల కింద నమోదు చేసినప్పుడు దర్యాప్తులో మాత్రం శాతవాహన విషయంలో పక్షపాతంగా వ్యవహరించారని విద్యార్థులు విమర్శిస్తున్నారు. లీకేజీ అయిన కాలేజీ యాజమాన్యాలనుగానీ, నిర్లక్ష్యంగా వ్యవహరించిన సిబ్బందిని చాలామంది విషయంలో ఉదాసీనంగా వ్యవహరించి, వారందరినీ వదిలేశారని విద్యార్థి సంఘాలు మండిపడుతున్నాయి. కేసు విచారణ, చార్జిషీటు పూర్తయిందని పోలీసు వర్గాలు సమాధానమిస్తున్నాయి.

### కేసు పునర్విచారించాలి



2021లో శాతవాహనవర్సిటీ డిగ్రీ కాలేజీ పేపర్ల లీకేజీ ఘటన కలకలం రేపింది. ఈ కేసులో పోలీసులు లోతైన దర్యాప్తు జరపలేదన్న విమర్శలు ఉన్నాయి. ఈ కేసును మళ్లీ దర్యాప్తు జరపాలి. కేసుతో సంబంధం ఉన్న ప్రతీ ఒక్కరినీ తిరిగి ప్రశ్నించాలి. నిందితులకు కేంద్రం తీసుకువచ్చిన కొత్త చట్టం ప్రకారం శిక్షలు పడాలి.

– మణికంఠ, ఏఐఎస్‌ఎఫ్, రాష్ట్ర అధ్యక్షుడు

### పోలీసుల తీరు బాధాకరం



శాతవాహన వర్సిటీ డిగ్రీ పరీక్ష పత్రాల లీకేజీలో పోలీసుల దర్యాప్తు తూతూ మంత్రంగా సాగినట్లుగా ఉంది. ఇంత పెద్ద వ్యవహారంలో కేవలం ఇద్దరే సూత్రధారులు అంటే నమ్మశక్యంగా లేదు. పలు కాలేజీల నుంచి పేపర్లు లీకయ్యాయని వాట్సాప్‌లో బయటపడ్డ పేపర్లు సాక్ష్యంగా నిలిచినా.. ఈ వ్యవహారంతో సంబంధమున్న మిగిలిన వారిని వదిలేయడం బాధాకరం.

– రాజేశ్, బీసీ విద్యార్థి సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు

## క్లుప్తంగా

### మాజీ ఎమ్మెల్యే రాజమల్లుకు నివాళి



రాజమల్లు కుటుంబసభ్యులను ఓదార్చుతున్న ఆర్టీసీ ఎండీ సజ్జనార్

**సుల్తానాబాద్(పెద్దపల్లి):** పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే బిరుదు రాజమల్లు పార్థీవదేహాన్ని కుటుంబసభ్యులు ప్రజల సందర్శనార్థం సుల్తానాబాద్‌లోని తమ ఇంటి వద్ద ఉంచారు. ఆర్టీసీ ఎండీ సజ్జనార్ మంగళవారం నివాళి అర్పించారు. బాధిత కుటుంబసభ్యులను ఓదార్చారు. రాజమల్లు మృతి తీరనిలోటని అన్నారు. రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్, పెద్దపల్లి, చెన్నూరు ఎమ్మెల్యేలు చింతకుంట విజయరమణారావు, గడ్డం వివేక్, మాజీ మంత్రి రాజేశంగౌడ్, మాజీ ఎమ్మెల్యేలు చందుపట్ల రాంరెడ్డి, ఆరెపల్లి మోహన్, పెద్దపల్లి డీసీపీ చేతన, రిటైర్డ్ డీఎస్పీలు సుదర్శన్ గౌడ్, మల్లారెడ్డి నివాళి అర్పించారు.

### జాతీయ బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపిక



కారుణ్య

**జగిత్యాలటౌన్:** ఒడిశాలో మంగళవారం నుంచి ఈ నెల 10వ తేదీ వరకు నిర్వహిస్తున్న జాతీయస్థాయి జూనియర్ బాస్కెట్‌బాల్ పోటీలకు జగిత్యాల విద్యార్థిని కారుణ్య ఎంపికైంది. ఆమె తెలంగాణ బాలికల జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు బాస్కెట్‌బాల్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా కారుణ్యను పీఈటీలు విశ్వప్రసాద్, నిరంజన్‌కుమార్, అజయ్‌బాబు, కృష్ణప్రసాద్, విద్యాసాగర్, వేణు, మంగ, వెంకటలక్ష్మి, రాజ్‌కుమార్ అభినందించారు.

### పలువురు సీఐల బదిలీ

**కరీంనగర్ క్రైం:** మల్టీజోన్–1లో పలువురు సీఐలను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఆర్.ప్రకాశ్‌గౌడ్ మెదక్ సీసీఎస్ నుంచి చొప్పదండి సీఐగా, గోపతి రవీందర్ చొప్పదండి నుంచి కరీంనగర్ టాస్క్‌ఫోర్స్–2కు, పి.విజయ్‌కుమార్ సీఐడీ నుంచి కరీంనగర్ పీసీఆర్‌కు, పి.విజ్ఞాన్‌రావును కరీంనగర్ పీసీఆర్ నుంచి మల్టీజోన్ కార్యాలయంలో రిపోర్టు చేయాలని, బి.రమేశ్‌ను జమ్మికుంట నుంచి మల్టీజోన్ కార్యాలయంలో రిపోర్టు చేయాలని పేర్కొన్నారు.

### ప్రమాదానికి కారణమైన వ్యక్తిపై కేసు

**జగిత్యాల క్రైం:** ప్రమాదానికి కారణమైన ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు జగిత్యాల పట్టణ ఎస్సై అబ్దుల్ రహీం మంగళవారం తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. మల్లాపూర్ మండలంలోని రాఘవపేటకు చెందిన మద్దెల మంగ, ఆమె బంధువు సోమిరెడ్డి రాజశేఖర్ పని నిమిత్తం బైక్‌పై సోమవారం జగిత్యాల వచ్చారు. కరీంనగర్ రోడ్డులో గల జయశంకర్ విగ్రహం వద్ద రోడ్డు దాటుతుండగా బుగ్గారం మండలంలోని గోపులాపూర్‌కు చెందిన మేరుగు వేణుమాధవ్ ద్విచక్రవాహనంపై అతివేగంగా వచ్చి, ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో రాజశేఖర్ తలకు, వెన్నుపూసకు బలమైన గాయాలయ్యాయి. మంగ ఫిర్యాదు మేరకు వేణుమాధవ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

### వృద్ధుడి ఆత్మహత్య

**మేడిపల్లి(జగిత్యాల):** మండలంలోని విలయతాబాద్‌కు చెందిన పిట్ల ఇంద్రయ్య(69) ఆత్మహత్య చేసుకున్నట్లు ఏఎస్సై హసన్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. ఇంద్రయ్య మద్యానికి బానిసయ్యాడు. డబ్బుల్లేక జీవితంపై విరక్తి చెంది, సోమవారం అర్ధరాత్రి తన ఇంటి ఎదుట చెట్టుకు ఉరేసుకున్నాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై పేర్కొన్నారు. ఇంద్రయ్యకు ముగ్గురు కుమారులు ఉన్నారు.

# మామిడి ఎక్స్‌పోర్ట్ జోన్ ఫలితమేది?

- జగిత్యాల జిల్లాను గతంలోనే గుర్తించిన కేంద్రం
- ప్రాసెసింగ్ యూనిట్లు వస్తే స్థానిక యువతకు ఉపాధి
- ప్రభుత్వం నుంచి కార్యాచరణ లేక పరిస్థితి అస్తవ్యస్తం



జగిత్యాలలో పూతకు వచ్చిన మామిడి తోటలు

**జగిత్యాల అగ్రికల్చర్:** ఆయా జిల్లాల్లో రైతులు సాగు చేసే పంటల విస్తీర్ణం, దిగుబడి, నాణ్యతను బట్టి కేంద్ర ప్రభుత్వం అంతర్జాతీయ ఎగుమతి హబ్‌లను ఏర్పాటు చేస్తుంది. ఈ మేరకు జగిత్యాలలో 60 వేల ఎకరాల్లో మామిడి తోటలు ఉండటం, కాయల రంగు, రుచి బాగా ఉండటంతో ఈ జిల్లాను మామిడి ఎక్స్‌పోర్ట్ జోన్‌గా కేంద్రం గతంలోనే గుర్తించింది. అయితే, జోన్‌తో చాలా లాభాలు ఉన్నప్పటికీ ఎలాంటి కార్యాచరణ లేకపోవడంతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది పరిస్థితి.

**రైతులు, వ్యాపారులకు లాభం**

మామిడి కాయలను పద్ధతి ప్రకారం తెంపడం, తర్వాత నీడలో ఆరబెట్టడం, కూలింగ్, గ్రేడింగ్, ప్యాకింగ్, రవాణా చేయడం వంటివి చేయాలి. ఎక్స్‌పోర్ట్ జోన్ ఏర్పాటుతో జగిత్యాలలో మామిడి గ్రేడింగ్, కూలింగ్, ప్యాకింగ్ వంటి ప్రాసెసింగ్ యూనిట్లు వచ్చే అవకాశం ఉంది. వీటివల్ల సీజన్‌లో వ్యాపారులు రైతుల నుంచి నేరుగా మామిడి కాయలను కొనుగోలు చేసి, ప్రాసెసింగ్ చేసి నేరుగా ఇతర దేశాలకు ఎగుమతి చేసే వీలుంటుంది. ఫలితంగా రైతులకు మంచి ధరతోపాటు వ్యాపారులకు కలిసి రానుంది. ముఖ్యంగా, కాయలను గ్రేడింగ్, కూలింగ్ చేసేందుకు కూలీలు ఎక్కువగా అవసరమవుతారు. దీనివల్ల స్థానికులకు ఉపాధి దొరుకుతుంది.

**కఠిన నిబంధనలు**

అమెరికాతోపాటు ప్రపంచ దేశాల్లో మనిషి ప్రాణానికి చాలా ప్రాముఖ్యత ఇస్తారు. అక్కడి ప్రజలు తినే ఆహార పదార్థాల కల్తీ విషయంలో చర్యలు తీవ్రంగా ఉంటాయి. ఇటీవల ఇతర దేశాల నుంచి వచ్చే ఆహార పదార్థాలపై పురుగు మందుల అవశేషాలు ఉంటున్నాయని కఠిన నిబంధనలు విధించారు. మామిడి కాయలు ఆయా దేశాల నిబంధనల ప్రకారం లేకుంటే, అక్కడకు చేరినా వెనక్కి పంపిస్తారు. అందుకే అన్ని రకాల పరీక్షల తర్వాతే ఎగుమతికి అనుమతి ఇవ్వాల్సి ఉంటుంది.

**ఎక్స్‌పోర్ట్ కంపెనీలతో ఒప్పందం**

మామిడిని ప్రాసెసింగ్ చేసే విధానాలు ఖర్చుతో కూడుకున్నవి. కాబట్టి గ్రామాల్లో లేదా మండలాల్లో మామిడి తోటలు ఉన్న రైతులు రైతు ఉత్పత్తిదారుల సంఘంగా ఏర్పడి, దాని ద్వారా ఎక్స్‌పోర్ట్ కంపెనీతో ఒప్పందం చేసుకోవాలి. ఆ కంపెనీ మామిడికాయల దిగుబడిని బట్టి స్థానికంగానే ప్రాసెసింగ్ పరిశ్రమలు ఏర్పాటు చేయడం లేదంటే ఇప్పటికే ప్రాసెసింగ్ పరిశ్రమ ఉన్నచోటకు తరలించడం చేస్తుంది. రైతులు ఆయా కంపెనీలతో ముందుగానే ధర మాట్లాడుకొని, అధికారుల సమక్షంలో అగ్రిమెంట్ చేసుకుంటే గిట్టుబాటు ధర వస్తుంది.

**ప్రభుత్వం ధ్రువీకరించాలి**

మామిడికాయల్లో ఎలాంటి పురుగు మందుల అవశేషాలు లేవని ప్రభుత్వం వివిధ పరీక్షలు నిర్వహించి, ధ్రువీకరించాల్సి ఉంటుంది. సంబంధిత పత్రం ఉంటేనే ఎగుమతిదారులతోపాటు ఆయా దేశాలు అనుమతి ఇస్తాయి. అపెడా(వ్యవసాయ, ప్రాసెస్డ్ ఆహార ఉత్పాదనల ఎగుమతి అభివృద్ధి ప్రాధికార సంస్థ) ముందుకు వచ్చి, ఎగుమతి విషయాలను ఇటు రైతులకు, అటు వ్యాపారులకు తెలియజేయాల్సిన అవసరం ఉంది.

**అపెడాతో కలిసి శిక్షణ ఇస్తాం**



జిల్లాలో మామిడి సాగు ఎక్కువగా ఉండటంతో, ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం ఎక్స్‌పోర్ట్ జోన్‌గా గుర్తించింది. దీనికి సంబంధించి ప్రభుత్వం నుంచి ఎలాంటి గైడెన్స్ రాకపోవడంతో కార్యాచరణ జరగలేదు. అయినప్పటికీ, అపెడాతో కలిసి ఉద్యానశాఖ ద్వారా పలుమార్లు రైతులకు శిక్షణ సమావేశాలు ఏర్పాటు చేశాం. ఇంకా ఎవరైనా ముందుకు వస్తే శిక్షణ ఇస్తాం.

– ప్రతాప్‌సింగ్, జిల్లా ఉద్యానశాఖాధికారి, జగిత్యాల

# కులగణన తర్వాతే 'స్థానిక' ఎన్నికలు జరపాలి

- బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలి
- రౌండ్ టేబుల్ సమావేశంలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత, పక్కన నాయకులు

**కరీంనగర్:** రాష్ట్రంలో కులగణన చేపట్టి, బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని భారత జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు 6 నెలల్లో కులగణన చేపట్టడానికి తక్షణమే ప్రక్రియ ప్రారంభించాలన్నారు. మంగళవారం కరీంనగర్‌లో భారత జాగృతి, యునైటెడ్ పూలే ఫ్రంట్ సంయుక్తంగా నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆమె మాట్లాడారు. 2024–25 బడ్జెట్‌లో బీసీల సంక్షేమానికి రూ.20 వేల కోట్లు కేటాయించాలన్నారు. అసెంబ్లీలో మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహ ఏర్పాటుపై ఏప్రిల్ 11లోగా ప్రభుత్వం సానుకూల ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. యూపీఏ ప్రభుత్వం రూ.4,500 కోట్లు ఖర్చు చేసి, కులగణన చేపట్టినా సంబంధిత వివరాలను ప్రజల ముందు పెట్టలేదని ఆరోపించారు. బీసీ సబ్ ప్లాన్‌కి చట్టబద్ధత కల్పించాలని, ఎంబీసీల కోసం ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలన్నారు. మహిళా రిజర్వేషన్లలో ఓబీసీ మహిళలకు కోటా కల్పించాలని పేర్కొన్నారు. 2018 నుంచి ఇప్పటివరకు 4,365 మంది సివిల్స్‌కు ఎంపికైతే వారిలో 1,195 మందే బీసీ, ఎస్సీ, ఎస్టీలు ఉన్నారని తెలిపారు. బీసీ మేధావులు రిజర్వేషన్‌పై గళమెత్తాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల రూ.26 లక్షల కోట్లతో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో బీసీలకు కేవలం రూ.5 వేల కోట్లు కేటాయించిందని మండిపడ్డారు. ఈ సమావేశానికి గుంజపడుగు హరిప్రసాద్ అధ్యక్షత వహించగా బీఆర్‌ఎస్ నాయకుడు, మాజీ మంత్రి రాజేశం గౌడ్, యునైటెడ్ పూలే ఫ్రంట్ కన్వీనర్ గట్టు రామచందర్‌రావు, నాయకులు బొల్ల శివశంకర్, రాజారాం యాదవ్, వారాల శ్రీనివాస్, భారత జాగృతి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవీన్ ఆచారి, జిల్లా అధ్యక్షుడు జాడి శ్రీనివాస్, బాలసంకుల అనంతరావు, ఉయ్యాల శ్రీనివాస్, గందె మాధవి, గుగ్గిళ్ల జయశ్రీ, మేకల మాధవి, ఆయా కుల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# నేటినుంచి 'ప్రత్యేక' పారిశుధ్య కార్యక్రమాలు

- ఈనెల 15 వరకు ప్రతిరోజు కార్యక్రమాలు



దుబ్బల గూడెం

**ధర్మపురి/కథలాపూర్:** గ్రామాల్లో పచ్చదనం, పరిశుభ్రత నెలకొల్పడమే లక్ష్యంగా జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించనున్నారు. సర్పంచుల పదవీకాలం ముగియడంతో ప్రతి గ్రామపంచాయతీకీ ఒక ప్రత్యేకాధికారిని నియమించింది ప్రభుత్వం. వారి ఆధ్వర్యంలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టనున్నారు. బుధవారం నుంచి ఈనెల 15 వరకు ముమ్మరంగా నిర్వహించేలా ప్రణాళిక రూపొందించారు.

**380 గ్రామాలు.. 177 మంది ప్రత్యేకాధికారులు**

జిల్లాలో 380 గ్రామపంచాయతీలు ఉండగా.. 177 మంది ప్రత్యేకాధికారులను నియమించారు. కొందరి అధికారులకు రెండు, మూడు గ్రామపంచాయతీల బాధ్యతలు అప్పగించారు. పారిశుధ్య కార్యక్రమాలకు యువత, మహిళాసంఘాలు, స్వచ్ఛంద సంస్థలను భాగస్వామ్యం చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. పంచాయతీల్లో 15వ ఆర్థిక సంఘం నిధులు ఉన్నాయని, పారిశుధ్య కార్యక్రమాలకు అవసరమైన నిధులను వినియోగించుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. రోజువారీగా చేపట్టే పనులకు ప్రణాళిక రూపొందించుకోవాలని, వారం రోజుల్లో సమస్యలన్నీ పరిష్కరించాలని సూచించారు. ప్రధానంగా గ్రామాలు పరిశుభ్రంగా ఉంచడం, ప్రజలకు ట్యాంకుల ద్వారా మంచినీరు సరఫరా, వేసవిలో తాగునీటికి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. పనితీరు ఆధారంగా ఉత్తమ పంచాయతీలను ఎంపిక చేసి ప్రశంసా పత్రాలు ఇస్తామని జిల్లా అధికారులు తెలిపారు.

**స్పెషల్ డ్రైవ్‌లో చేపట్టే పనులు ఇలా...**

- ప్రతిరోజూ రోడ్లను శుభ్రం చేయడం, డ్రైనేజీల్లో పూడిక తీయడం, గుంతల్లో నీరు నిల్వలు లేకుండా చూడడం.
- గ్రామం పరిధిలోని అన్ని వాడల్లో గుంతలను పూడ్చడం.
- ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఆరోగ్య ఉపకేంద్రాలు, బస్టాండులు, ప్రభుత్వ సంస్థలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించడం.
- గ్రామాల్లో నివాసాల మధ్య ఉన్న ఖాళీ స్థలాలను శుభ్రం చేయించడం, శిథిలావస్థలో ఉన్న ఇళ్లను తొలగించడం, పాడుబడిన బావులను పూడ్చివేయించడం.
- మురికినీరు నిల్వ ఉండే ప్రాంతాల్లో ఆయిల్ బాల్స్ వేయించడం. గ్రామాల్లోని అన్ని వాడల్లో దోమల నివారణ మందులు స్ప్రేచేయించడం.

# రెండో విడత 'దళిత బంధు' ఇవ్వాలి

- హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి



బాధితుడితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి

**జమ్మికుంట(హుజూరాబాద్):** రెండో విడత దళిత బంధు నిధులు వెంటనే ఇవ్వాలని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. జమ్మికుంట పట్టణానికి చెందిన బోడికల శ్రీనివాస్‌కు దళిత బంధు రెండో విడత సాయం రాకపోవడంతో మనస్తాపం చెంది, ఇటీవల ఆత్మహత్యాయత్నం చేశాడు. ఈ సందర్భంగా బాధితుడిని ఎమ్మెల్యే మంగళవారం పరామర్శించారు. కలెక్టర్ పమేలా సత్పతికి ఫోన్ చేసి, నిధులు విడుదల చేయాలని కోరారు. అనంతరం మాట్లాడుతూ.. రాష్ట్రంలో దళితుల అభివృద్ధి కోసం మాజీ సీఎం కేసీఆర్ దళిత బంధు పథకాన్ని తీసుకువచ్చారని తెలిపారు. హుజూరాబాద్ నియోజకవర్గాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి, 18,021 కుటుంబాలను గుర్తించారన్నారు. వీటిలో 5 వేల కుటుంబాలకు మొదటి విడతలో రూ.5 లక్షలు వచ్చాయని, రెండో విడత రూ.5 లక్షలను లబ్ధిదారుల బ్యాంక్ అకౌంట్లలో వేసిందని పేర్కొన్నారు. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం ఆ డబ్బులను ఫ్రీజ్ చేసిందని బాధితులు చెబుతున్నారని అన్నారు. వారు ఆందోళన చెందుతున్నారని, విషయాన్ని మంత్రుల దృష్టికి తీసుకెళ్లానని, జాప్యం చేయకుండా నిధులు విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సతీమణి శాలిని, మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు, వైస్ చైర్మన్ దేశిని స్వప్న, పీఏసీఎస్ చైర్మన్ పొనగంటి సంపత్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు టంగుటూరి రాజ్‌కుమార్, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

**ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్..**

బోడికల శ్రీనివాస్‌ను ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్ పరామర్శించారు.

# సైన్‌బోర్డు ఆర్టిస్ట్ రాములు మృతి

- మెదడులో రక్తం గడ్డకట్టడంతో చికిత్స పొందుతూ తుదిశ్వాస
- ఎల్లారెడ్డిపేటలో విషాదం



రాములు (ఫైల్)



నివాళి అర్పిస్తున్న ఆగయ్య, రాములు మిత్రులు

**ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల):** ఇన్నాళ్లూ అందమైన చిత్రాలను గీసిన కుంచె ఆగిపోయింది.. తన గీతతో ఎన్నో భావాలు పలికించిన కళాకారుడు తుదిశ్వాస విడిచారు.. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన సైన్ ఆర్టిస్ట్ శ్రీరామ్ రాములు(68) మృతిచెందారు. వివరాల్లోకి వెళ్తే.. రాములు వృత్తిరీత్యా కొంతకాలంగా హైదరాబాద్‌లోని ఉప్పల్ ఫిర్జాదిగూడలో ఉంటూ సైన్‌బోర్డు ఆర్టిస్ట్‌గా పని చేస్తున్నారు. తనకు వచ్చిన విద్యతో ఎందరో జూనియర్ ఆర్టిస్టులకు ఉపాధి చూపారు. ఈ క్రమంలో వారం రోజుల క్రితం మెదడులో రక్తం గడ్డ కట్టడంతో స్పృహ కోల్పోగా, కుటుంబసభ్యులు ఆస్పత్రిలో చేర్పించారు. అప్పటి నుంచి చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున చనిపోయారు. విషయం తెలుసుకున్న స్థానిక ప్రజాప్రతినిధులు, రాములు మిత్రులు హైదరాబాద్‌కు వెళ్లి, నివాళి అర్పించారు. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య మాట్లాడుతూ.. రాములు మృతి కళారంగానికి తీరనిలోటన్నారు. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వడ్నాల నర్సయ్య, రాములు మిత్రులు కందుకూరి రమణ, నలిమెల సత్యం, నంది కిషన్, లింగాల సుదర్శన్‌గౌడ్, మోతి దేవిరెడ్డి తదితరులున్నారు. రాములుకు భార్య పద్మ, కుమారులు కిరణ్, కార్తీక్, కూతురు క్రాంతి ఉన్నారు.

# పుస్తెలతాడు ఎత్తుకెళ్లిన దంపతుల అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ, ఎస్సై

**గంగాధర(చొప్పదండి):** ఓ మహిళ మెడలోని పుస్తెలతాడు ఎత్తుకెళ్లిన దంపతులను అరెస్టు చేసినట్లు చొప్పదండి సీఐ రవీందర్, గంగాధర ఎస్సై అభిలాష్ తెలిపారు. వారి వివరాల ప్రకారం.. కొడిమ్యాల మండలంలోని నాచుపల్లికి చెందిన ఇట్టి లక్ష్మి ఆదివారం గంగాధర మండలం గర్శకుర్తిలోని తన కూతురు ఇంటికి బయలుదేరింది. ఆటోడ్రైవర్ కొమ్మనవేణి రాజు ఆటో ఎక్కింది. అతను తన భార్య పద్మావతితో కలిసి లక్ష్మిని మధురానగర్ చౌరస్తా సమీపంలోని మామిడి తోటలోకి తీసుకెళ్లాడు. ఇద్దరూ కలిసి ఆమె మెడలోని పుస్తెలతాడు లాక్కొని, పారిపోయారు. ఈ ఘటనపై బాధితురాలు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. నిందితులను మంగళవారం కరీంనగర్‌లో అరెస్టు చేశారు. ఆటోను సీజ్ చేసి, పుస్తెలతాడు స్వాధీనం చేసుకొని, వారిని రిమాండ్‌కు పంపించినట్లు సీఐ పేర్కొన్నారు.

# మామిడిపల్లిలో కూలిన ఇల్లు

- దంపతులకు తప్పిన ప్రాణాపాయం



కూలిన ఇంట్లో బాధితురాలు

**కోనరావుపేట(వేములవాడ):** ఇల్లు ఉన్నట్టుండి కూలిపోగా.. దంపతులకు ప్రాణాపాయం తప్పింది. వివరాలిలా ఉన్నాయి.. కోనరావుపేట మండలంలోని మామిడిపల్లికి చెందిన ఉస్కెం లక్ష్మి–రాములు దంపతులకు నలుగురు కూతుళ్లు కాగా, అందరికీ వివాహాలు జరిపించారు. గతంలో ఇంటి వాసం విరిగిపోగా పేదరికం కారణంగా మరమ్మతు చేయించలేదు. సపోర్ట్‌గా కర్రను ఏర్పాటు చేసుకొని, నివసిస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం ఇల్లు ఒక్కసారిగా కూలిపోయింది. సరిగ్గా అదే సమయంలో వారు బయటకు వెళ్లడంతో ప్రాణాపాయం తప్పింది. తమకు గుంట భూమి కూడా లేదని, ఇప్పుడు ఉన్న ఇల్లు కూలిపోయిందని బాధితులు కంటతడి పెట్టారు. దాతలు ఆదుకోవాలని, ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరుతున్నారు.

# చిన్నారిని చిదిమేసిన ఆటో

- కన్నీరుమున్నీరైన తల్లిదండ్రులు
- ఉపాధి కోసం వచ్చిన 10 రోజులకే ఘటన
- బాధితులది తూర్పు గోదావరి జిల్లా

**కొత్తపల్లి(కరీంనగర్):** ఉపాధి కోసం సొంత రాష్ట్రం దాటొచ్చారు.. 10 రోజులకే తమ చిన్నారిని ఆటో రూపంలో మృత్యువు కబళించడంతో ఆ దంపతులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఏఎస్సై పోచయ్య వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తూర్పు గోదావరి జిల్లా దేవరపల్లికి చెందిన పలు కుటుంబాలు ఉపాధి నిమిత్తం కొత్తపల్లి మండలంలోని చింతకుంట గ్రామానికి వచ్చాయి. వీటిలో వేముల ఆనంద్ కుటుంబం ఒకటి. టీ ఫైబర్ నెట్ కేబుల్ కాంట్రాక్టర్‌కు సంబంధించిన పనులు చేపట్టేందుకు స్థానిక శివాలయం సమీపంలో గుడిసెలు వేసుకున్నారు. వీరు మంచినీటి కోసం ఓ వాటర్ ప్లాంట్‌ను మాట్లాడుకున్నారు. రోజు మాదిరిగానే మంగళవారం కూడా ఆటోలో మంచినీరు వచ్చింది. పట్టుకునేందుకు ఆనంద్ భార్య వెళ్లగా ఆమె వెనకే వీరి పాప నూతనశ్రీ(18 నెలలు) సైతం వెళ్లింది. ఇది గమనించని ఆటోడ్రైవర్ ఆటోను వెనక్కి తీస్తుండగా ఆ చిన్నారి టైర్ కింద పడి, మృతిచెందింది. దీంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. పాప తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.



### రాజన్న టెండర్‌కు రూ.1.51 కోట్లు



**వేములవాడ:** మార్చి 10, 2024 నుంచి మార్చి 09, 2026 వరకు రాజన్న ఆలయంలో పట్టు, కాటన్ చీరలు, దోవతులు, శెల్లాలు పొందే లైసెన్సుకు మంగళవారం రెండోసారి టెండర్ నిర్వహించారు. సిరిసిల్లకు చెందిన చొప్పదండి నికిల్‌కుమార్ రూ.1,51,15,516కు దక్కించుకున్నట్లు ఏఈవో హరికిషన్ తెలిపారు. జనవరి 12న టెండర్ నిర్వహిస్తే రూ.1.01 కోట్లు మాత్రమే రావడంతో అధికారులు వాయిదా వేశారు. రెండోసారి నిర్వహిస్తే అదనంగా రూ.50 లక్షల ఆదాయం సమకూరింది. రాజన్న ఆదాయానికి గండి కొట్టేందుకు కొంతమంది కాంట్రాక్టర్లు చేసిన ప్రయత్నం విఫలమైనట్లు తెలిసింది.

### అంజన్న సన్నిధి.. భక్తజన పెన్నిధి



**కొండగట్టు(చొప్పదండి):** జగిత్యాల జిల్లా కొండగట్టు శ్రీఆంజనేయ స్వామి ఆలయం మంగళవారం వేలాది మంది భక్తులతో కిక్కిరిసిపోయింది. సమ్మక్క జాతర నేపథ్యంలో కొండకు రావడం ఆనవాయితీగా వస్తోంది. సుమారు 50 వేల మంది అంజన్నను దర్శించుకున్నారని, రూ.19 లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ వర్గాలు పేర్కొన్నాయి. ట్రాఫిక్‌జామ్ కారణంగా జేఎన్‌టీయూ కళాశాల వరకు వాహనాలు నిలిచిపోయాయి. ఏర్పాట్లను ఏఈవో అంజయ్య, సూపరింటెండెంట్ శ్రీనివాస శర్మ, అధికారులు ధర్మేందర్, సంపత్ తదితరులు పర్యవేక్షించారు.

### 'సీటు' ఫైట్




గొడవ పడుతున్న ప్రయాణికులు

**వేములవాడ అర్బన్:** బస్సులో సీటు కోసం ఇద్దరు ప్రయాణికులు బాహాబాహీకి దిగిన ఘటన మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన ఓ కుటుంబం రాజన్న దర్శనం అనంతరం వేములవాడ ఆర్టీసీ బస్టాండ్‌లో హైదరాబాద్ వెళ్తున్న బస్సు ఎక్కింది. అయితే, మద్యం మత్తులో రెండు కుటుంబాలకు చెందినవారు బస్సు సీటు నాదంటే నాదని హంగామా చేశారు. దీంతో, డ్రైవర్ తిప్పాపూర్ వద్ద బస్సు ఆపాడు. అయినా వినకుండా కిందకు దిగిన సదరు వ్యక్తులు గొడవపడ్డారు. స్థానికులు నిలువరించి, వారిని మళ్లీ అదే బస్సులో పంపించారు.